క్లుప్తంగా

బక్రీద్ శుభాకాంక్షలు



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి

పుంగనూరు: బక్రీద్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.

గ్రామాల్లో 'జగనన్న సురక్ష' సర్వే



గొంగివారిపల్లెలో సర్వే చేస్తున్న నాయకులు

సదుం: మండలంలోని అమ్మగారిపల్లె, గొంగివారిపల్లెలో బుధవారం ఇంటింటా జగనన్న సురక్ష సర్వే చేశారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నర్మద, వరలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సాకేతరెడ్డి, నారాయణరెడ్డి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



తంబళ్లపల్లె ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

సదుం: ట్యాక్సీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రాతివారిపల్లెలో ఉన్న ఆయనను ఏఐటీయూసీ వాల్మీకి ట్యాక్సీ యూనియన్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు నాగభూషణంరెడ్డి, పాపయ్య, మణి, చెంగలరాయుడు, చంద్రశేఖర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సల్లాపురెమ్మ ఉత్సవాలు



అమ్మవారి పూజలో ఎమ్మెల్సీ భరత్, నాయకులు

శాంతిపురం: మఠం పంచాయతీలోని వెంకటేష్‌పురం, పొన్నేపల్లి గ్రామాల్లో సల్లాపురెమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. వెంకటేష్‌పురంలో బుధవారం అమ్మవారికి దీపారాధన, పాట కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ భరత్, తెలంగాణ రిటైర్డ్ ఐజీ ఎంకె సింగ్, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న పాల్గొన్నారు. పొన్నేపల్లిలో అన్నప్రసాద వితరణ, పచ్చిగెరిగ, అగ్ని గుండం, అమ్మవారి పుష్పపల్లకి వేడుకలు నిర్వహించారు.

అనుమానితులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి

సదుం: గ్రామాలలో ఎవరైనా సంచరిస్తుంటే అనుమానితులు సంచరిస్తున్న పక్షంలో అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వాలని విలేజ్ పోలీస్ ఆఫీసర్ సత్యనారాయణ కోరారు. బుధవారం జోగివారిపల్లెలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్ తదితర వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. గ్రామాల్లో వివాదాలకు తావులేకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనితాకుమారి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లిన వ్యక్తి గల్లంతు



గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది


పెద్దపంజాణి: మండలంలోని పెద్దవెలగటూరు సమీపంలోని క్వారీ గుంతలో సరదాగా ఈతకు వెళ్లిన వ్యక్తి గల్లంతు అయినట్లు బుధవారం సమాచారం అందిందని పుంగనూరు ఫైర్‌స్టేషన్ అధికారి సుబ్బరాజు తెలిపారు. దీంతో వెంటనే ఆయన తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కానీ అక్కడ ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదన్నారు. నీటి గుంతలో ఎక్కువగా రాళ్లు ఉన్నందున గాలించేందుకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని చెప్పారు. గల్లంతైన వ్యక్తి పుంగనూరు పట్టణానికి చెందిన కరీంసాబ్ కుమారుడు సయ్యద్‌బాషా అని స్థానికుల తెలిపారన్నారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

– జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



సంక్షేమ బావుటా బుక్‌లెట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తున్నారని జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం మండలంలోని నెర్నిపల్లి పంచాయతీలోని నెర్నిపల్లి, దయాలపల్లి, నీలందాసార్లపల్లి, లక్ష్మీపురం, ఎగువచాడేపల్లి, పైపల్లి, మిట్టూరు గ్రామాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు 708 గడపలకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిన బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు.

చంద్రబాబు కోసమే పవన్ ఆరాటం..

చంద్రబాబు కోసమే రోడ్డెక్కిన పవన్‌కల్యాణ్‌కు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే హక్కు లేదని జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. రౌడీలు, గూండాలంటూ వైఎస్సార్‌సీపీ నేతలపై పవన్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. వారాహి యాత్రలో మా పార్టీ, కార్యకర్తలపై తిట్లపురాణం తప్ప, ప్రజల కష్టసుఖాలను పట్టించుకోవా పవన్ ? అని ప్రశ్నించారు. చంద్రబాబు బటన్ ఆఫ్ చేసేంత వరకూ ఇలా వ్యాఖ్యలు చేస్తూనే ఉంటావా అని దుయ్యబట్టారు. చంద్రబాబు ప్రణాళిక ప్రకారమే, పవన్ కల్యాణ్ వారాహియాత్ర సాగుతుందని వారు ఎద్దేవా చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ..

వి.కోట పంచాయతీ పాపేపల్లికి చెందిన సురేష్‌కు రూ.2 లక్షలు, తోటకనుమ పంచాయతీకి చెందిన మోహన్ కుమార్‌కు రూ.2 లక్షలు, వి.కోట పంచాయతీకి చెందిన కల్యాణ్‌కు రూ.2.40 లక్షల చెక్కులను ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీలు డాక్టర్ తమీమ్, లక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీరాములరెడ్డి, గోపిరెడ్డి, నాయకులు ఆంజనేయులు, బర్కత్, రామకృష్ణ, మురళి, ప్రతాప్‌రెడ్డి, మిట్టూరు ప్రకాష్, పంచాయతీ కన్వీనర్ సత్యప్రకాష్, జేసీఎస్ మండల కన్వీనర్ కిషోర్‌కుమార్, ఎంపీటీసీ యశోదమ్మ, మండల మహిళా అధ్యక్షురాలు శశికళ, కోఆప్షన్ మెంబర్ జబీఉల్లా, రెస్కో డైరెక్టర్ భూపతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



వి.కోట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



గుడుపల్లె : మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్

వి.కోట: మన రాష్ట్రంలో ప్రజలకు ప్రతి ఒక్కరికీ రైతులకు జీవనోపాధి, పిల్లలకు ఉన్నతమైన చదువులు, వృద్ధులకు, మహిళలకు గౌరవమైన జీవితాన్ని అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంకల్పిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం మండలంలోని నెర్నిపల్లి గ్రామంలో విలేకరుల సమావేశంలో జూలై 1వ తేదీ నుంచి పలమనేరు నియోజకవర్గంలో ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఇంటిలోనూ సమస్యలు అనేవి లేకుండా ఉన్న గడపలు చూడాలన్న ఉద్దేశంతోనే సీఎం జగనన్న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్తారన్నారు. పరిష్కారం కానటువంటి సమస్యలను తెలుసుకుని మండల, మున్సిపల్ స్థాయిల్లోని అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ లక్ష్మణ్ రెడ్డి, తమీమ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఏ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీలు లక్ష్మరెడ్డి, తమీమ్‌ఖాన్, నాయకులు ఆంజనేయులు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

గుడుపల్లె: పేదల కోసం ఉచితంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల జేసీఎస్ కన్వీనర్ రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ద్వారా అందించే సర్టిఫికెట్లను వారం రోజుల్లోపు ఇంటికే వచ్చి అందించనున్నట్లు తెలిపారు. ఒక్కో సచివాలయం పరిధిలో 6 రోజులు ఇంటి వద్దకు అధికారులు వస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, నాయకులు చెంద్రాయన్, సంపంగి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు ఏపీడీగా సునీల్



పలమనేరు: పలమనేరు ఉపాధిహామి ఏపీడీగా సునీల్ బుధవారం విధుల్లో చేరారు. చిత్తూరు డ్వామా కార్యాలయంలో పని చేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వరప్రసాద్ బదిలీపై తిరుపతి జిల్లా గూడూరుకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన సునీల్ మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలో లక్ష్యం మేరకు ఉపాధి పనులను వేగవంతం చేసేందుకు కృషిచేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, సచివాలయాల కన్వీనర్ ముర్వత్‌బాషా కోరారు. బుధవారం జగనన్న సురక్షపై మండలంలోని వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులకు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమాన్ని కలసికట్టుగా విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్డీశ్వరరెడ్డి, నాద మునిరెడ్డి, నాగరాజ ప్రసాద్, ప్రసాద్ , ప్రభాకర, నాగిరెడ్డి, గోవర్ధన్, రాఘవరెడ్డి, కేశవరెడ్డి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రామకుప్పం: మండలంలోని సింగసముద్రం పంచాయతీ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పాల్గొనే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, మండల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

కరాటే బెస్ట్ ఫైటర్‌గా పల్లవి ప్రియ

రామకుప్పం: మలేషియా ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని చెల్దిగానిపల్లి పంచాయతీ బూరుగుమాకులపల్లెకు చెందిన సుబ్రమణ్యం, మోహన దంపతుల కుమార్తె పల్లవి ప్రియ ప్రథమ బహుమతిని సాధించి బెస్ట్ ఫైటర్‌గా నిలిచింది. పల్లవిప్రియ బెంగళూరులో ఎనిమిదో తరగతి చదువుతోంది.



28కె.పి.ఎం32- పల్లవి ప్రియ

పంటమార్పిడితో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం డాక్టర్ రెడ్డిరాము

రొంపిచెర్ల: రాగి పంట సాగుకు రైతులు మొగ్గు చూపాలని చిత్తూరు ఏరువాక కేంద్రం డాక్టర్ రెడ్డి రాము కోరారు. రాగి పంట సాగుపై బుధవారం ఆయన గానుగచింత గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, పంట మార్పిడి వలన అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. ఎకరాకు 3 కిలోల రాగి విత్తనాలు వాడితే చాలన్నారు. అలాగే ఏడేళ్ల లోపు ఉన్న మామిడి తోటలలో కూడా అంతరపంటగా రాగిని చేసుకోవచ్చన్నారు. పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రాఘవేంద్ర, మండల వ్యవసాయాధికారి సుధారాణి, ఏఈఓ ఖాదర్‌వల్లి, సర్పంచ్ హేమలత, ఎంపీటీసీ రమణయ్య, వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ చంద్రయ్య నాయుడు, వైస్ చైర్‌పర్సన్ శారద, ఆర్‌బీకే సిబ్బంది సుబ్రమణ్యం, నరిసింహులు, రేఖ, వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు



విశేష అలంకరణలో కనుమ గంగమ్మ

పెద్దపంజాణి: మండలంలోని ఆకులవారిపల్లి, గౌరీనగర్, బేరుపల్లి, బందార్లపల్లి, గంకొండ, బాలేపల్లి గ్రామాల్లో గంగజాతర బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున నుంచి మండపంలో అమ్మవారు కొలువుదీరగా పరిసర గ్రామాల ప్రజలు, పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శిరస్సు మెరవణి..

అమ్మవారి శిరస్సు మెరవణి మంగళవారం అర్ధరాత్రి ఆయా గ్రామాల్లో మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా సాగింది. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని కొలువుదీర్చారు. ఊరేగింపులో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి శిరస్సుకు హారతులిచ్చారు.

అంబలి సమర్పణ..

అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన అంబలి సమర్పణకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన పెద్ద డ్రమ్ములో భక్తులు ఇంటి నుంచి తీసుకువచ్చిన అంబలిని పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు నిమజ్జనం..

రెండురోజుల పాటు నిర్వహించిన గంగజాతర గురువారం ఉదయం నిమజ్జనంతో పరిసమాప్తం కానుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయనున్నారు.

వి.కోటలో...

వి.కోట: మండలంలోని కత్రిపల్లి గ్రామ దేవత గంగమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. బుధవారం కరిపల్లి నుంచి చౌడేపల్లిలోని సల్లాపురెమ్మ దేవతకు దీపాలు, పూలగెరిగెలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించుకుంటారు.


బదిలీ టీచర్‌కు వీడ్కోలు సన్మానం



ఉపాధ్యాయుడిని బాబురమేష్‌ను సన్మానిస్తున్న సహోద్యోగులు

చౌడేపల్లె: మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకల చిన్నేపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జి.బాబురమేష్‌ను గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఇక్కడ ఆయన ఎనిమిదేళ్లపాటు పనిచేశారు. ఇటీవల ఆయన బదిలీ అయిన నేపథ్యంలో ఆయన సేవలను ప్రస్తుతిస్తూ సన్మానించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నాగమల్లిక, పద్మజ, విశ్రాంత హెచ్ఎం విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు వీరభద్రయ్య, అమృత, సుధాకర్ నాయుడు, లింగమూర్తి, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా విద్యాభివృద్ధి



విద్యార్థులకు నగదు బహుమతులను అందిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: విద్యాభివృద్ధిలో దేశానికే ఆదర్శవంతమైన రాష్ట్రంగా ఏపీ ఉండడం గర్వించదగ్గ విషయమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని పత్రపల్లి జెడ్పీ హైస్కూల్లో జగనన్న ఆణిముత్యాల్లో భాగంగా పదోతరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులను జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా సత్కరించారు. ఈ సందర్భంగా గోవిందనగర్‌కు చెందిన నాగరాజు కుమార్తె నందిని ప్రథమ స్థానం సాధించగా, పత్రపల్లికి చెందిన చిట్టిబాబు కుమార్తె హర్షిత ద్వితీయస్థానంలో, లింగమూర్తి కుమార్తె జ్యోతి మూడవ స్థానంలో నిలిచారు. వీరికి జెడ్పీచైర్మన్ నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాల్లో భాగంగా విద్యార్థులను ఇలా నగదు బహుమతులతో సత్కరించడం గొప్పవిషయమన్నారు. ఎంఈఓ-2 మురుగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యంత్రాల వినియోగంపై విచారణ

పలమనేరు: మండలంలోని పెంగరగుంట పంచాయతీ ముసలిమొడుగు ప్రాంతంలో కొందరు రైతులు ఉపాధిహామీ పనులను కూలీలతో కాకుండా జేసీబీ యంత్రాలతో చేస్తున్న విషయంపై స్థానిక డ్వామా ఏపీడీ వరప్రసాద్ ఆదేశాల మేరకు జేఈ సుబ్రమణ్యం, ఎఫ్ఏ గిరిబాబు బుధవారం విచారణ చేపట్టారు. కొందరు రైతులు ఈజీఎస్‌లో పనులు మంజూరు కాకుండానే ముందస్తుగా వారి పొలాల్లో మామిడి మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వినట్టు తెలుసుకున్నారు. అయితే అక్కడ గుంతలు తవ్విన వాటికి పనులు మంజూరు కాలేదని తేలింది. దీంతో ఎవరైనా మామిడి మొక్కల పెంపకానికి పనులు చేపట్టితే కచ్చితంగా కూలీల ద్వారానే పనులు చేపట్టాలని యంత్రాలను వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు అమ్మఒడి ఓ వరం



మాట్లాడుతున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: అమ్మఒడి పథకం పేద విద్యార్థులకు వరం లాంటిదని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. జగనన్న అమ్మఒడి పథకం నాలుగో విడత పంపిణీ సందర్భంగా బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్లల్లో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడం జరిగిందన్నారు. విద్యార్థులు చక్కగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ సాయిలీల, షేక్‌నాషాద్, హెచ్‌ఎం విశ్వనాథయ్య, పాల్గొన్నారు.

గుడుపల్లె ఎంపీడీఓగా శ్రీనివాసన్



గుడుపల్లె: మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ఆర్.శ్రీనివాసన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీఓగా పని చేసిన రమణ సస్పెండ్ అయ్యారు. ఆ స్థానంలో పాలసముద్రం ఎంపీడీఓ శ్రీనివాసన్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పలమనేరు: కౌండిన్య నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సెబ్ అధికారులు బుధవారం సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. వీటి రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోనున్నట్టు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను స్థానిక డిపోలో ఉంచారు. గత మూడు రోజుల నుంచి సెబ్ స్క్వాడ్ అధికారులు కౌండిన్య నదిలో ఇసుకను తరలిస్తున్న వాహనాలపై దాడులు చేస్తున్న విషయం తెలిసిందే.

స్మగ్లింగ్‌కు యత్నం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని రిజర్వ్‌ఫారెస్టులో ఎర్రచందనం స్మగ్లింగ్‌కు యత్నించిన సంఘటన నాలుగురోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రిజర్వ్ ఫారెస్టులో అర్ధరాత్రి 2 గంటల సమయంలో 4 ఎర్రచందనం చెట్లు నరికి, దుంగలను బైక్‌పై స్మగ్లింగ్ చేయడానికి ఇద్దరు ప్రయత్నించారు. ఆ అలికిడికి గస్తీలో ఉన్న అటవీశాఖ గార్డులు అటువైపుగా వెళ్లారు. వారిని చూసిన దొంగలు బైక్‌ను వదిలిపెట్టి అక్కడి నుంచి పరారయ్యారు.

పట్టణాభివృద్ధికి పెద్దపీట



సమావేశానికి హాజరైన కౌన్సిల్ బృందం, మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

- రూ.44.13 లక్షల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం
- ఎమ్మెల్యే సూచించిన పనులకు ప్రాధాన్యత
- మున్సిపల్ పార్కులో జిమ్ వస్తువులకు ఆమోదం
- మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ

పలమనేరు: మున్సిపాలిటీలో రూ.44.13 లక్షలతో అభివృద్ధి పనులకు మున్సిపల్ పాలకవర్గం ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ సమావేశపు హాలులో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అన్ని అంశాలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సూచించిన మేరకు పట్టణంలోని 16, 19 వార్డులో డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేశామన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యానికి సంబంధించి, పైపులైన్ల రిపేర్ల కోసం మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వెచ్చించేందుకు ఆమోదం దొరికిందన్నారు. గతంలో కౌన్సిల్ తీర్మానించిన పనులకు రాటిఫికేషన్ చేసిందన్నారు. కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని పార్కులో జిమ్ వస్తువుల ఏర్పాటుకు నిధులు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గుంటూరు నుంచి త్వరలో ఈ-ఆటోలను తెప్పిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఆ స్థలాలను కాపాడుకుందాం..

పట్టణంలోని వాగు పొరంబోకు స్థలాలను కాపాడుకునేలా మున్సిపల్ అధికారులు చొరవ చూపాలని కౌన్సిలర్ కోదండరామయ్య సూచించారు. గొబ్బిళ్ల కోటూరులో ఎక్కువమంది జ్వరాలతో బాధపడుతున్నారని ఇక్కడ పారిశుద్ధ్య చర్యలను చేపట్టాలని ఆ వార్డు కౌన్సిలర్ శారద సూచించారు. మరోవైపు ఆ గ్రామంలో జూదం కారణంగా చాలామంచి అప్పులపాలై గ్రామాన్ని విడిచి వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పెండింగ్‌లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని కౌన్సిలర్ హైదర్ సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కిరణ్‌కుమార్, చాన్మాకమాల్, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లలో సాంకేతిక పరీక్షలు



కొండామర్రి ట్రాన్స్‌కో ఉపకేంద్రం వద్ద సామర్థ్యపు పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

సదుం: పుంగనూరు నియోజకవర్గంలో నూతనంగా నిర్మిస్తున్న 33 కేవీ సబ్‌స్టేషన్లలో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ ఉప్పరపల్లె సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. పుంగనూరు మండలంలోని అమ్మిగానిపల్లె, చంద్రమాకులపల్లె, చౌడేపల్లె మండలంలోని పెద్దకొండామర్రి, సదుం మండలం ఉప్పరపల్లెలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లకు టెక్నికల్ చార్జ్ చేసినట్టు వెల్లడించారు. పుంగనూరు డీఈ విజయన్, కన్‌స్ట్రక్షన్ డీఈ దామోదర్, ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ మహేశ్వర్‌రెడ్డి, ఎంఆర్‌టీ డీఈ నరేంద్ర, ఏడీ రమేష్, ఏడీఈలు నరేంద్ర, రవి, ఏఈలు సుబ్రమణ్యం, చంద్రశేఖర్, మహేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

లో ఓల్టేజి సమస్య లేకుండా విద్యుత్ సరఫరా

చౌడేపల్లె: గృహాలకు, వ్యవసాయానికి లో ఓల్టేజి సమస్య నివారించడంతోపాటు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం కొండామర్రి సమీపంలో 5 ఎంవీఏ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉప కేంద్రాన్ని అధికారుల బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కేంద్రంతో సుమారు 1,560 వ్యవసాయ కనెక్షన్లతో పాటు కొండామర్రి, వెంగళపల్లె, పెద్దయల్లకుంట్ల పంచాయతీ గ్రామాల గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి వీలవుతుందన్నారు. దీనిని త్వరలో మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈ విజియన్, ఏడీఏలు రవి, సతీష్, ఏఈ రాజశేఖర్, సర్పంచ్ జయసుధమ్మ, నేతలు నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.